క్లుప్తంగా

ఘనంగా సుబ్రహ్మణ్య షష్ఠి



ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యస్వామి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక రామేశ్వరంలోని శ్రీముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయంలోని సుబ్రహ్మణ్యస్వామికి షష్ఠి సందర్భంగా ప్రత్యేక పూజాకార్యక్రమాలను నిర్వహించారు. వేకువ జామున స్వామివారికి పంచామృతాభిషేకం, పూజద్రవ్యాలతో అభిషేకం నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పెద్ద ఎత్తున స్వామివారిని దర్శించి కాయాకర్పూరాలను సమర్పించి భక్తిశ్రద్ధలతో పూజించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలను అందచేశారు. అలాగే అగస్త్యేశ్వరస్వామి, రతనాల వేంకటేశ్వరస్వామి తదితర ఆలయాల్లోని సుబ్రహ్మణ్యస్వామికి సుబ్రహ్మణ్య షష్ఠి సందర్భంగా ప్రత్యేక పూజలు, అలంకరణ చేశారు.

తిరుప్పావై పాశుర పారాయణం



పారాయణంలో పాల్గొన్న మహిళలు

పోరుమామిళ్ల : పట్టణంలోని శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి, శ్రీ వీరాంజనేయస్వామి దేవస్థానాలలో సోమవారం ధనుర్మాస తిరుప్పావై పాశుర పారాయణాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా టీటీడీ జిల్లా ధర్మ ప్రచార మండలి సభ్యులు తుపాకుల శ్రీనివాసులు మాట్లాడుతూ ధనుర్మాసంలో శ్రీ రంగనాథ గోదాదేవీల పూజలు నిర్వహించడం మోక్షదాయకమన్నారు. దేవస్థాన కమిటీల ఆధ్వర్యంలో 30 రోజులపాటు తిరుప్పావై పాశుర ప్రవచనాలు జరుగుతాయన్నారు. రాణిరత్నప్రభ, శెట్టిం గురులక్ష్మిల పారాయణంతో సోమవారం పాశురాల ప్రారంభం జరిగిందన్నారు. నెల రోజులపాటు జరిగే ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని రంగనాథ, గోదాదేవిల అనుగ్రహానికి పాత్రులు కావాలని శ్రీనివాసులు అన్నారు.

దుస్తుల పంపిణీ

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల ఆర్సీయం చర్చి పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 245 మంది వృద్ధులకు సోమవారం ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్ సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ గీత, థామస్‌రెడ్డి దంపతులు క్రిస్మస్, నూతన సంవత్సర కానుకగా దుస్తులు పంపిణీ చేశారు. సంస్థ ప్రతినిధులు శ్రీకాంత్‌రెడ్డి, ప్రసాదరెడ్డి వృద్ధులకు దుస్తులను అందచేశారు. కార్యక్రమంలో విచారణ గురువులు విజయభాస్కర్, రాజేంద్ర పాల్గొన్నారు.

సందడి చేసిన జబర్దస్త్ వర్ష



షోరూంలో జబర్దస్త్ వర్ష, ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక దొరసానిపల్లె రోడ్డులోని శ్రీ సీవీఎస్ మౌళిక శిల్క్స్ ప్రథమ వార్షికోత్సవ వేడుకలను సోమవారం నిర్వహించారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి, జబర్దస్త్ నటి, యాంకర్ వర్ష పాల్గొని కేక్ కట్ చేశారు. అక్కడకు వచ్చిన అభిమానులతో సెల్ఫీలు తీసుకున్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.


బీమా సాయం పంపిణీ



నగదును నాగలక్ష్మికి అందిస్తున్న దృశ్యం

రాజుపాళెం : మండలంలోని కూలూరు గ్రామ పంచాయతీలోని ఉప్పలపాడుకు చెందిన చాకలి బాలుడు అనారోగ్యంతో సోమవారం మరణించాడు. ఈ విషయాన్ని కూలూరు సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ ప్రదీప్ ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. ఆ కుటుంబానికి వైఎస్సార్ బీమా కింద నమోదు కావడంతో తక్షణ సహాయంగా ఖర్చుల కింద రూ.10 వేలును వైఎస్సార్‌సీపీ నాయకుడు పెరుగు నాగేశ్వరరావు, ప్రదీప్‌లు బాలుడు భార్య నాగలక్ష్మికి అందించారు. కార్యక్రమంలో వలంటీర్ పద్మావతి పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక ఆంధ్రకేసరి రోడ్డులోని అఖిల గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం కార్యాలయంలో సంఘం ఆధ్వర్యంలో 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు గుండుమల్ల నాగయ్య నూతన సంవత్సరం అందరికి శుభాలు తేవాలని ఆకాంక్షించారు. సంఘం వైస్ ప్రెసిడెంట్ జీసీ పుల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు అండగా ఉంటా

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



బీమా పత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : నియోజకవర్గంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయం కోసం ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి అవిశ్రాంతంగా శ్రమిస్తున్న పార్టీ శ్రేణులకు అండగా ఉండి, వారిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత తనపై ఉందని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. సోమవారం ఒకటో వార్డులో వైఎస్సార్‌సీపీ అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, మాజీ కౌన్సిలర్ శౌరి సుభాష్‌రెడ్డి ఆధ్వర్యంలో సచివాలయ కన్వీనర్లు, సిబ్బంది, గృహసారథులు, వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు మొత్తం 200 మందికి బీమా బాండ్లను ఎమ్మెల్యే రాచమల్లు పంపిణీ చేశారు. సంక్షేమ పథకాలు, ప్రొద్దుటూరు అభివృద్ధి పనులతో రూపొందించిన 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తపాలా శాఖ ద్వారా 200 మందికి బీమా పాలసీలు నమోదు చేశామని తెలిపారు. ఏదైనా ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.10 లక్షలు, సహజ మరణం అయితే రూ.2 లక్షలు నామినీకి అందిస్తారన్నారు. ప్రమాదవశాత్తు గాయాలైతే చికిత్సకు రూ.60 వేలు, ప్రతి రోజు రూ.1000 చొప్పున పది రోజులకు రూ.10 వేలు కుటుంబ ఖర్చులకు ఇస్తారని వివరించారు. నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ విజయం కోసం కృషి చేస్తున్న ప్రతి ఒక్కరికీ బీమా పాలసీని చేస్తామన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. భవిష్యత్తులో సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రాబోవు 2024 ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి రాబోవు ఎన్నికల్లో ఎమ్మెల్యేగా రాచమల్లు శివప్రసాదరెడ్డి, సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకునేందుకు ప్రతి ఒక్క కార్యకర్త శ్రమించాలని కోరారు. ఒకటో వార్డులో ప్రతి ఇంటిలో ఒకరికి రూ.10 లక్షల బీమా చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి నాగరాజు, కౌన్సిలర్ పదిటి సరోజ, మాజీ కౌన్సిలర్ శౌరి సుభాష్‌రెడ్డి, ఆర్‌పీసీఏ మెంబర్ కాకర్ల నాగశేషారెడ్డి, ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్ గోనా ప్రభాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కామిశెట్టి బాబు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నాడు–నేడు పనుల పరిశీలన

స్థానిక 32వ వార్డులోని శ్రీవూటుకూరు వీరయ్య ప్రభుత్వ హైస్కూలలో మన బడి–నాడు కింద చేపడుతున్న అదనపు తరగతి గదుల నిర్మాణాలను సోమవారం ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పరిశీలించి మాట్లాడారు. హైస్కూల్‌లో రూ.2 కోట్లతో తరగతి గదులతోపాటు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా ఈనెల 21న పాఠశాల నూతన గదులను ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, వార్డు కౌన్సిలర్ భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి, మున్సిపల్ ఇంజనీర్ సాయికృష్ణ, హైస్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



నాడు-నేడు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

సీఎం జగన్ జన్మదినం సందర్భంగా సేవా కార్యక్రమాలు



నాయకులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

మైదుకూరు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జన్మదినం సందర్భంగా ఈనెల 21వ తేదీ గురువారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి తెలిపారు. సీఎం జగన్ జన్మదిన వేడుకలను నిర్వహణపై సోమవారం సాయంత్రం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులతో ఎమ్మెల్యే చర్చించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మైదుకూరులోని మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 21న ఉదయం 8.30 గంటలకు రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్థానిక జెడ్పీ హైస్కూల్ మైదానంలో ఉదయం 10 గంటలకు మొక్కలు నాటే కార్యక్రమం ఉంటుందన్నారు. మైదుకూరు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న దివంగత నేత వైఎస్సార్ విగ్రహం వద్ద ఉదయం 11 గంటలకు సీఎం వైఎస్ జగన్ జన్మదిన కేక్ కటింగ్ కార్యక్రమం ఉంటుందన్నారు. అనంతరం 11.30 గంటలకు జెడ్పీ హైస్కూల్ మైదానంలో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, సీఎం వైఎస్ జగన్ అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఏపీఐఐసీ, ఆప్కో డైరెక్టర్లు డి.గంగాధర్‌రెడ్డి, ఉదయగిరి వెంకటేష్, నియోజకవర్గంలోని చాపాడు, బి.మఠం, ఖాజీపేట, దువ్వూరు, ఎంపీపీలు కె.లక్షుమయ్య, సి.వీరనారాయణరెడ్డి, అబూబకర్ సిద్దిక్, కె.జయచంద్రారెడ్డి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు అచ్చుకట్ల కరీముల్లా, మైదుకూరు వైస్ ఎంపీపీ ఊటుకూరు రఘురామిరెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరిశీలన



అభిప్రాయాలు తెలుసుకుంటున్న న్యాక్ బృందం

ప్రొద్దుటూరు : స్థానిక ఎస్‌సీఎస్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ప్రొఫెసర్ విజయ దేశ్ ముఖ్ అధ్యక్షతన సభ్యులు ప్రొఫెసర్ ఎస్ఎంకే ఖాద్రి, డాక్టర్ అనిరుద్ భార్గవన్ న్యాక్ బృందం సోమవారం కళాశాలను పరిశీలించింది. ఈ సందర్భంగా విద్యార్థుల తరగతి గదులు, ప్రయోగశాలలు, గ్రంథాలయంను, విద్యార్థులకు కల్పించిన మౌలిక వసతులను పరిశీలించారు. విద్యార్థుల, అధ్యాపకుల అభిప్రాయాలను వారు తెలుసుకున్నారు. విద్యార్థుల ఉత్తీర్ణత శాతం తెలుసుకుని రికార్డులను పరిశీలించారు. మంగళవారం కూడా పరిశీలన కొనసాగుతుందని, అనంతరం కళాశాలకు న్యాక్ గ్రేడ్ కేటాయిస్తారని కళాశాల ప్రిన్సిపాల్ జి.చంద్రశేఖర్ తెలిపారు.

పెన్షనర్లు సమాజానికి మార్గదర్శకులు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్డీఓ వెంకటరమణ

బద్వేలు అర్బన్ : నేటి సమాజానికి వృద్ధులు, విశ్రాంత ఉద్యోగులు, వారి అనుభవాలు ఎంతో మార్గదర్శకమని ఆర్డీఓ ఆకుల వెంకటరమణ పేర్కొన్నారు. జాతీయ పెన్షనర్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఎన్‌జీఓ హోంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పెన్షనర్లు అందరూ ఒక సంఘాన్ని ఏర్పాటు చేసుకుని కష్టనష్టాలను కుటుంబంలా భరిస్తూ పరిష్కరించుకోవడం అభినందనీయమన్నారు. కుడా చైర్మన్ గురుమోహన్, మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డిలు మాట్లాడుతూ విధి నిర్వహణలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని పదవీవిరమణ పొందిన విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగులు ఐక్యంగా సంఘం ఏర్పాటు చేసుకుని ముందుకెళ్లడం అభినందనీయమన్నారు. అనంతరం 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న గానుగపెంట హనుమంతరావు తదితరులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దారు మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీఓ నూర్జహాన్, పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రామ్మూర్తినాయుడు, తాలూకా అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ మీనాక్షిరెడ్డి, బ్రహ్మయ్య, ట్రెజరర్ గంగన్న, గౌరవాధ్యక్షులు పుల్లంరాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శి పిచ్చయ్య, లక్ష్మిరెడ్డి, రామసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

విద్యా విధానంలో మార్పులు రావాలి



ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పోరుమామిళ్ల : కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కొంతమందికే చదువులన్న మనుధర్మ సిద్ధాంతాన్ని అమలు చేస్తుందని ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ కార్యదర్శి చంద్రశేఖర్ ఆరోపించారు. సోమవారం పోరుమామిళ్లలో ఎస్ఎఫ్ఐ కడప జిల్లా 27వ మహాసభల ప్రారంభం సందర్భంగా పట్టణంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం విజన్ కోచింగ్ మైదానంలో జరిగిన బహిరంగసభలో చంద్రశేఖర్‌తోపాటు జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేంద్రప్రసాద్, ఉపాధ్యక్షులు రాహుల్, సహాయ కార్యదర్శి రవి, అజయ్‌కుమార్, భైరవప్రసాద్ తదితరులు మాట్లాడుతూ మెడికల్ కాలేజీ సీట్ల భర్తీ విషయంలో రాష్ట్రంలో రిజర్వేషన్లు పాటించడం లేదన్నారు. విద్యావిధానం కేంద్ర, రాష్ట్ర ఉమ్మడి జాబితాలో తొలగించి, కేంద్ర జాబితాలో పెట్టుకున్నారన్నారు. విశ్వవిద్యాలయాలు రాజకీయ కేంద్రాలుగా మారాయన్నారు. కొఠారి కమిషన్ నివేదిక అమలు కావడం లేదన్నారు. కళాశాలల్లో నాణ్యత లేని విద్య ఉందన్నారు. 11 వేల అధ్యాపకుల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. విద్యా విధానంలో సమూల మార్పులు రావాలన్నారు.

తుపాను నష్టపరిహార జాబితా పూర్తి



పంట నష్టం జాబితాను పరిశీలిస్తున్న ఏడీఏ నాగరాజు

బద్వేలు(అట్లూరు) : మిచాంగ్ తుపాను వలన సంభవించిన పంట నష్టంపై తుది నివేదికను జిల్లా వ్యవసాయ అధికారులకు అందజేసినట్లు బద్వేలు వ్యవసాయ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.నాగరాజు పేర్కొన్నారు. మండలాల వారీగా జరిగిన పంట నష్టంపై వ్యవసాయ అధికారులతోపాటు తహసీల్దారుతో జాబితా తయారు చేశామన్నారు. బద్వేలు మండల పరిధిలోని 602 మంది రైతులకు సంబంధించి 250 హెక్టార్లలో సుమారు రూ.42 లక్షలలో నష్టం వాటిల్లిందని అలాగే గోపవరం మండల పరిధిలో 337 మంది రైతులకు సంబంధించి 160 హెక్టార్లలో పంట నష్టం జరుగగా అందుకు గానూ రూ.27.22 లక్షలు నష్టం జరిగిందన్నారు. అట్లూరు మండల పరిధిలో 132 మంది రైతులకు సంబంధించిన 50 హెక్టార్లలో 6.38 లక్షలు, సిద్దవటం మండల పరిధిలో 22 మంది రైతులకు సంబంధించి 7.5 హెక్టార్లకు గానూ రూ.1.17 లక్షలు వెరసి బద్వేలు డివిజన్ పరిధిలో 1093 మంది రైతులకు సంభందించి 468 హెక్టార్లలో పంటనష్టం వాటిల్లినట్లు రూ.76.85 లక్షల నష్ట వాటిల్లిందన్నారు. నష్టపోయిన వరి పంటకు హెక్టారుకు రూ.17 వేలు చెల్లించడం జరుగుతుందన్నారు. ఉద్యాన పంటలకు సంబంధించి ఉద్యాన శాఖ ప్రత్యేకంగా నివేదిక తయారు చేశామని చెప్పారు. ఈమేరకు వారివారి రైతు భరోసా కేంద్రాల వద్ద నివేదిక ప్రదర్శించినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు బద్వేలు వ్యవసాయ కార్యాలయం దగ్గర గోడకు ప్రదర్శించిన నివేదికను ఆయన సోమవారం పరిశీలించారు.


ఆరోగ్య శ్రీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



చాపాడులో ఆరోగ్య శ్రీ సేవలపై సీఎం జగన్ ప్రసంగాన్ని వీక్షిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

చాపాడు : రాష్ట్ర ప్రభుత్వం విద్యా వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని.. ఈ క్రమంలో ప్రజలకు మరింత లబ్ధి చేకూర్చేలా రూపొందించబడిన వైఎస్సార్ ఆరోగ్య శ్రీ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలని మండల అధ్యక్షుడు లక్ష్మయ్య పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ప్రజాప్రతినిధులు, అధికారులు సీఎం జగన్ ప్రసంగాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా హాజరైన ఎంపీపీ మాట్లాడుతూ.. గతంలో మాదిరి కాకుండా ప్రజలకు మరింత ఉపయోగపడేలా ఆరోగ్య శ్రీ సేవలను రూ.25లక్షలకు పెంచుతూ మార్పులు చేసిన ఈ పథకాన్ని ప్రజలు వినియోగించుకోవాలన్నారు. ప్రభుత్వం జారీ చేసిన ఆరోగ్య శ్రీ కార్డులను ప్రతి కుటుంబానికి చేర్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీడీఓ శ్రీధర్‌నాయుడు, ద్వార్రా ఏపీఎం వెంకటరమణ, మండల వైద్యాధికారులు శ్రీవాణి, ఓబులసు, కావ్య, ఆరోగ్య విస్తరణాధికారి రాఘవయ్య, సీహెచ్ఓ మహదేవయ్య తదితరులు పాల్గొన్నారు.

బాబ్జి మృతి ప్రజా ఉద్యమాలకు తీరనిలోటు



బాబ్జీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాయకులు

పోరుమామిళ్ల : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ బాబ్జీ మృతి ప్రజా ఉద్యమాలకు తీరనిలోటని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి చెన్నయ్య, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి, ఏపీటీఎఫ్ అధ్యక్షులు సత్తార్ పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం ఎమ్మార్సీ వద్ద మూడు ఉపాధ్యాయ సంఘాల నేతలు, కార్యకర్తలు బాబ్జీ మృతికి ప్రగాఢ సంతాపం తెలిపారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాధారణ ఉపాధ్యాయుడిగా జీవితం మొదలుపెట్టిన బాబ్జీ అంచలంచెలుగా ఎదిగి ఎమ్మెల్సీ అయ్యారన్నారు.

సీఎం జగన్‌తోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యం



వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



వైఎస్సార్‌సీపీ పుస్తకాలను విడుదల చేస్తున్న కుడా చైర్మన్ గురుమోహన్

ప్రొద్దుటూరు : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి తెలిపారు. సోమవారం స్థానిక 25వ వార్డు 27వ సచివాలయం పరిధిలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ కులమతాలకు, పార్టీలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. మున్సిపాలిటీలోని అన్ని వార్డులో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా జరుగుతున్నాయన్నారు. వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షులు కామిశెట్టి బాబు, కోనేటి సునంద మాట్లాడుతూ రాష్ట్రంలో సచివాలయ, వలంటీర్ల వ్యవస్థల ద్వారా ప్రజలకు సుపరిపాలన అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేనన్నారు. గత ప్రభుత్వంలో పింఛన్లు తీసుకోవాలంటే తీవ్ర ఇబ్బంది పడేవాళ్లన్నారు. సీఎం జగన్ ప్రభుత్వానికి, చంద్రబాబు ప్రభుత్వానికి తేడాను గమనించి రాబోవు ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేయాలని తెలిపారు. అభివృద్ధి కార్యక్రమాల వివరాల బోర్డును ఆవిష్కరించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ జెండాను ఎగుర వేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ 25వ వార్డు ఇన్‌చార్జి నూరి, నగర కార్పొరేషన్ డైరెక్టర్ ఉప్పర మురళి, కౌన్సిలర్లు కమాల్ బాషా, వద్ద ఖలీల్, కోఆప్షన్ సభ్యుడు మల్లికార్జున యాదవ్, 22వ వార్డు ఇన్‌చార్జి హిదాయత్, సచివాలయ కన్వీనర్ గఫార్, ఇస్మాయిల్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

సంక్షేమ సారథికి అండగా నిలుద్దాం

బద్వేలు అర్బన్ : ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చి అన్ని వర్గాల ప్రజలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలిచారని, అటువంటి సంక్షేమ సారథికి అండగా నిలిచి మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని కడప అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ సింగసాని గురుమోహన్ పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని అగ్రహారం సచివాలయం పరిధిలో సోమవారం ఆంధ్రాకు జగనే ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా సచివాలయం పరిధిలోని ఆయా కుటుంబాలకు గడిచిన నాలుగున్నర ఏళ్లలో చేకూరిన లబ్ధిని తెలిపే బోర్డును ప్రదర్శించారు. అనంతరం సచివాలయం ఆవరణలో పార్టీ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చేందుకు టీడీపీ 600 పైగా హామీలను ఇచ్చిన వాటిని విస్మరించిందన్నారు. 2019 ఎన్నికల్లో చేసిన హామీలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేరవేరుస్తూ మాట నిలబెట్టుకున్నారని గుర్తుచేశారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థలతో పాలనలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారన్నారు. సచివాలయ పరిధిలో జరిగిన లబ్ధిని ప్రజలకు తెలియజేశారు. ప్రజలకు మేలు చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రాబోవు ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సుందర్‌రామిరెడ్డి, యద్దారెడ్డి, పుత్తా శ్రీరాములు, గిద్దలూరు అసెంబ్లీ ఎన్నికల పరిశీలకులు బంగారుశీనయ్య, మున్సిపల్ వైస్‌చైర్మన్ గోపాలస్వామి, వార్డు కౌన్సిలర్లు ఆవుల శివకుమారి, ఓబుల్‌రెడ్డి, చెన్నకృష్ణారెడ్డి, అనిల్‌కుమార్, నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల నిరసన

ప్రొద్దుటూరు : స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ఏడవ రోజు సీఐటీయూ, ఏఐటీయూసీ అనుబంధ అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ముందుగా తహసీల్దార్ కార్యాలయం నుంచి శివాలయం సర్కిల్ వరకు ర్యాలీగా వెళ్లి అక్కడ మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ అంగన్‌వాడీలకు రూ.26 వేలు వేతనం ఇవ్వాలని, పనిభారం తగ్గించాలని డిమాండ్ చేశారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, అంగన్ వాడీ కేంద్రాల బాడుగలను పెంచాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, పట్టణ కార్యదర్శి విజయకుమార్, ఎస్ఎఫ్ఐ నాయకులు, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వం అంగన్‌వాడీలతో చర్చలు జరపాలి



మానవహారంగా ఏర్పడ్డ అంగన్‌వాడీలు

పోరుమామిళ్ల : అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె 7వ రోజుకు చేరింది. ప్రభుత్వం వెంటనే వారితో చర్చలు జరిపి పరిష్కారం చూపాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు భైరవప్రసాద్ కోరారు. 7 రోజులుగా అంబేడ్కర్ సర్కిల్‌లో సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలు సోమవారం మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. కనీస వేతనాలు పెంచాలని, పెన్షన్, గ్రాట్యుటీ ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం పట్టించుకోకపోతే విజయవాడలో అసెంబ్లీ ముట్టడి చేస్తామన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నేతలు పాల్గొన్నారు.

20న విద్యుత్ అదాలత్

మైదుకూరు : విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 20వ తేదీ విద్యుత్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు విద్యుత్ ఈఈ జి.వెంకటరామిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మైదుకూరు డివిజన్ కార్యాలయ ఆవరణలో ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మైదుకూరు, బద్వేలు నియోజకవర్గాల్లోని 13 మండలాలకు చెందిన విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను రాతపూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. అదాలత్‌లో విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదులు పరిహార సంస్థ (సీజీఆర్ఎఫ్) చైర్మన్ వి.శ్రీనివాస ఆంజనేయ మూర్తి, ఆర్థిక సభ్యుడు కె.రామమోహన్‌రావు, సాంకేతిక సభ్యుడు ఎస్ఎల్ అంజనీకుమార్, స్వతంత్ర సభ్యురాలు జి.ఈశ్వరమ్మ పాల్గొని వినియోగదారుల సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తారని వివరించారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి

ప్రొద్దుటూరు : మండలంలోని కొత్తపల్లె పంచాయతీ సచివాలయం వద్ద సోమవారం సీఎం జగన్ చిత్రపటానికి సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పథకాన్ని అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అమలు చేశారన్నారు. ఆయన తనయుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీ మరింత విస్తరించి రూ.25 లక్షల వరకు ఉచితంగా వైద్య సేవలు అందించేందుకు పెంచారని తెలిపారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ శశిధర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి నరసింహులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి



కెరీర్ గైడెన్స్ పుస్తకాన్ని అందజేస్తున్న దృశ్యం

కలసపాడు : ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకుని కష్టపడి చదవాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు పి.రమణారెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని ఎగువ రామాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వివేకానంద ఫౌండేషన్ ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు విద్య, ఉద్యోగ అవకాశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాన్ని ఏర్పారచుకొని ప్రణాళిక బద్ధంగా చదివితే విజయం సాధిస్తారన్నారు. ఉన్నత చదువులకు పదవ తరగతి కీలక మెట్టు అని తెలియజేశారు. తాము చదువుకున్న రోజుల్లో సరైన అవగాహన లేక ఇబ్బందులు ఎదుర్కొనేవాళ్లమని చెప్పుకొచ్చారు. సమాజ సేవలో ముందుండే వివేకానంద ఫౌండేషన్ సంస్థ వ్యవస్థాపకులు రామకృష్ణారెడ్డి విద్యార్థుల భవిష్యత్తు కోసం స్వయంగా కెరీర్ గైడెన్స్ పుస్తకాన్ని రూపొందించి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లోని పదవ తరగతి విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేయడం అభినందించదగ్గ విషయమన్నారు. రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి సంస్థ ఎల్లవేళలా కృషి చేస్తుందని తెలిపారు. అనంతరం 66 మంది పదవ తరగతి విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు ఎస్.కమాల్, ఉపాధ్యాయులు సత్యం, శ్రీనివాసులు, బ్రహ్మారెడ్డి, గురయ్య, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ఐటీకి అకడమిక్ ఎక్సలెంట్ అవార్డు



ఎక్సలెంట్ అవార్డుతో కళాశాల యాజమాన్యం రాజేశ్వరరెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్ : సాయిరాజేశ్వరి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజనీరింగ్ కళాశాలకు అకడమిక్ ఇన్‌సైట్స్ నుంచి 2023కు గాను అకడమిక్ విజన్ ఎడ్యుకేషన్ ఎక్సలెంట్ అవార్డు లభించింది. కళాశాల చైర్మన్ బసిరెడ్డి రాజేశ్వరరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వీరకుమార్‌రెడ్డి, కరస్పాండెంట్ వీరకళ్యాణ్‌రెడ్డి తమ కళాశాలకు ఎక్సలెంట్ అవార్డు రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. విలువలతో కూడిన విద్యను అందిస్తూ విద్యార్థుల్లో ఇంజనీరింగ్ నైపుణ్యాలను పెంపొందిస్తున్నామన్నారు. ప్రిన్సిపాల్ పాండురంగన్ రవి, అధ్యాపకుల కృషి వల్లే ఈ అవార్డు లభించిందన్నారు.

పథకాలను ప్రజలు వినియోగించుకోవాలి

చాపాడు : రాష్ట్ర ప్రభుత్వ పథకాలతో పాటు కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సుబ్బరాయుడు అన్నారు. మండలంలోని అన్నవరం, టీఓపల్లె గ్రామాలలో సోమవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మాట్లాడుతూ.. ప్రజలకు ప్రభుత్వాల నుంచి అందే ప్రతి పథకం గురించి తెలుసుకుని వినియోగించుకోవాలని సూచించారు. ఈఓపీఆర్డీ రాధాకృష్ణవేణి, మండల వైద్యాధికారి రాజేష్‌కుమార్, ఇండేన్ గ్యాస్ విత్రక్ ప్రొప్రయిటర్ రామసుధాకర్‌రెడ్డి, సర్పంచ్‌లు పీరయ్య, మునేంద్ర తదితరులు పాల్గొన్నారు.